RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | బుధవారం 2 అక్టోబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 142 | పేజీలు: 4 | వెల: రూ.5/-



## తెలుగు రాష్ట్రాలకు వరద సాయం ప్రకటించిన కేంద్రం

ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,036 కోట్లు,
తెలంగాణకు రూ.416.80 కోట్లు

2లో..



### 370 ఆర్టికల్‌ను పునరుద్ధరిస్తామన్న పార్టీ

## మేలు చేస్తుందా?

### తప్పుడు వాగ్దానాలతో తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్

కుటుంబాన్ని బలోపేతం చేసుకోవడమే దాని లక్ష్యం

హర్యానా ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు

**చండీగఢ్, న్యూఢిల్లీ, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు):**:హస్తం పార్టీ అన్ని తప్పుడు వాగ్దానాలే చేస్తుంటుందని కాంగ్రెస్ పార్టీ పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పాల్వాల్‌లో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న ప్రధాని ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు. దేశం కోసం ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ కాంగ్రెస్ వ్యతిరేకించింది. అయోధ్య నిర్మాణంలోనూ అడ్డు చెప్పింది. జమ్మూకశ్మీర్‌లో పూర్తి స్థాయిలో రాజ్యాంగాన్ని అమలు చేయాడాన్ని వ్యతిరేకించింది. పార్లమెంట్, విధాన సభల్లో మహిళలకు రిజర్వేషన్లను నిరాకరించింది. కాంగ్రెస్.. దేశంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమైంది. కానీ, తమ కుటుంబాన్ని మరింత బలోపేతం చేయడానికి శ్రమించిందని కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజల్లోని దేశభక్తిని నాశనం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ప్రజల్లో యూనిటీ ఎంత బలంగా ఉంటే.. కాంగ్రెస్ గెలుపు కూడా అంతే అసాధ్యం అని భావిస్తోంది. అందుకే దేశభక్తుల ఐక్యతను నాశనం చేసేందుకు ఆ పార్టీ తీవ్రంగా యత్నిస్తోంది. రాష్ట్రంలో భాజపా పదేళ్లుగా అధికారంలో ఉందని, ఇక ప్రజలు తమకు అధికారం అప్పగిస్తారని కాంగ్రెస్ భావిస్తోంది. గతంలో మధ్యప్రదేశ్ విషయంలోనూ ఇదే విధంగా అపోహ పడింది. కాంగ్రెస్ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేస్తోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఇదే చేసింది. హరియాణాలోనూ తన వ్యూహాన్ని అమలు చేయాలని చూస్తోంది. వారి కుట్రను మనమంతా భగ్నం చేయాలని మోదీ పేర్కొన్నారు. కేంద్రం రద్దు చేసిన ఆర్టికల్ 370ని తిరిగి తీసుకువస్తామని కాంగ్రెస్ చెబుతోంది. కానీ, పాక్ ఆక్రమిత ప్రాంతాన్ని (పీవోకే) వెనక్కి తీసుకొస్తామని ఎన్నడైనా చెప్పిందా..?పాకిస్థాన్‌కు మద్దతుగా ఉండే ఆ పార్టీ.. హరియాణా ప్రజల అభివృద్ధి కోసం ఆలోచించగలదా..? అని ప్రశ్నించారు. కాగా.. హరియాణాలో అక్టోబరు 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఆయా పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఎన్నికలకు కొద్ది సమయమే ఉండడంతో ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.

### మూసీ నది ప్రక్షాళనలో

# మరో అడుగు

### కూల్చివేతలు షురూ చేసిన అధికారులు



**హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు):** హైదరాబాద్ మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని మూసీ నదీ గర్భంలో నిర్వాసితుల ఇళ్లను అధికారులు కూల్చివేస్తున్నారు. శంకర్‌నగర్‌లో కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వడంతో కొంతమంది స్వచ్ఛందంగా నివాసాలను ఖాళీ చేశారు. అలా ఖాళీ చేసిన వారి గృహాలను అధికారులు కూల్చివేస్తున్నారు. వీధులు ఇరుకుగా ఉండడంతో కూలీల సహాయంతో నివాసాలు నేలమట్టం చేస్తున్నారు. నిర్వాసితుల సామగ్రి తరలింపునకు రెవెన్యూ అధికారులు వాహనాలు ఏర్పాటు చేశారు. మూసీ నది ప్రక్షాళనలో భాగంగా మరో అడుగు ముందుకు పడింది. నదీ గర్భంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను ప్రభుత్వం కూల్చివేస్తోంది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని చాదర్ ఘాట్, శంకర్ నగర్, వినాయక వీధి, రసూల్ పురా, మూసానగర్ ప్రాంతాల్లో నిర్వాసితుల ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సుమారు 100 మంది అడ్డా కూలీల సహకారంతో సమ్మెట, గుణపాలతో అక్రమ నిర్మాణాలపై విరుచుకుపడ్డారు. ఒక్కొక్క ఇంటిని పెకిలిస్తూ పోయారు. ఓవైపు కూల్చివేతలు కొనసాగుతుండగా మరోవైపు మార్కింగ్ చేసిన ఇళ్లలోని పలు కుటుంబాలు హుటాహుటినా సామగ్రిని సర్దుకొని వారికి కేటాయించిన రెండు పడకల గదుల ఇళ్లకు వెళ్లిపోయారు. కూల్చివేత

..మిగతా 2లో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ శుభాకాంక్షలు



**హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. ఈ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనం అన్నారు. ఎంగిలిపూల నుంచి సద్దుల వరకూ అందరూ కలిసి పండుగను జరుపుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, వారి కష్టాలను తొలగించాలని గౌరమ్మను సీఎం ప్రార్థించారు.





### కేసీఆర్ బతుకమ్మ పండుగ

## శుభాకాంక్షలు

**హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు):** బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడబిడ్డలకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ అస్తిత్వానికీ, సాంస్కృతిక జీవనానికి ప్రతీక.. బతుకమ్మ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని, పూలను దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ ప్రపంచ సంస్కృతీ సాంప్రదాయాల్లోనే ప్రత్యేకతను చాటుకుందన్నారు. తర తరాలుగా మహిళా సామూహిక శక్తికి ఐక్యతకు దర్పణమైన బతుకమ్మ పండుగ, తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజల అస్తిత్వ ఆకాంక్షలకు వేదికగా నిలిచిందని కేసీఆర్ తెలిపారు. ఎంగిలి పూలతో ప్రారంభమై సద్దుల తో ముగిసే తొమ్మిది రోజుల బతుకమ్మ సందర్భంగా పల్లెలు పట్టణాలు బేధం లేకుండా మహిళలతో పిల్లా పాపలతో ప్రత్యేక సందడి నెలకొంటుందని కేసీఆర్ తెలిపారు. బతుకమ్మ పండుగ విశిష్టతను ప్రాశస్త్యాన్ని గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ'ను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని తెలిపారు. మహిళల ప్రత్యేక పండుగగా గుర్తించి బతుకమ్మ సందర్భంగా ప్రత్యేక కానుకలను అందజేసిన విషయాన్ని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పండుగను ఆటా పాటలతో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని, తెలంగాణ ఆడబిడ్డలను కేసీఆర్ కోరారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో ప్రకృతి మాత బతుకమ్మ వెలుగులు నింపాలని ప్రార్థించారు.

## మూసీ ప్రక్షాళన పేరుతో లూటీ

మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్

ఎమ్మెల్యేలతో కలసి అంబర్‌పేటలో పర్యటన

బాధితులకు భరోసా ఇచ్చిన బిఆర్ఎస్ నేతలు



**హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు):** మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సర్వే, కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండి పడ్డారు. హైదరాబాద్‌లో లక్షలాది మందికి నిద్రలేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు ఇండ్లు కూల్చుత రోనని ప్రజలు ఆవేదనలో ఉన్నారని చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక పరిధి తులసీరామ్ నగర్‌లో మూసీ ప్రాంత వాసులను మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్,

..మిగతా 2లో

### మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

## ఏర్పాటు చేసిందెవరు?

### మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు):** మూసీ నది ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. 2017లోనే ఇందుకు ప్రణాళిక రూపొందించిందన్నారు. మూసీ ప్రక్షాళనపై గత ప్రభుత్వంలో జరిగిన సమావేశం వివరాలను మంత్రి వెల్లడించారు. వారు చేస్తే మంచి మేము అమలు చేస్తే మాత్రం తప్పంటూ రాద్ధాంతం చేయడం తగదన్నారు. మూసీ నది ప్రక్షాళనపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను మంత్రి శ్రీధర్‌బాబు తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. మూసీ ప్రక్షాళన తాము చేసిన ఆలోచన కాదని, గత ప్రభుత్వమే రూపకల్పన చేసి ప్రణాళిక రూపొందించిందని వివరించారు. మూసీ నది ప్రక్షాళనపై అప్పటి మంత్రి కేటీఆర్ ఎన్నో సమావేశాలు నిర్వహించారన్నారు. అక్రమ కట్టడాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయాలని 2021లో కేటీఆర్ ఆదేశించారన్నారు. మూసీ నిర్వాసితులకు రెండుపడక గదుల ఇళ్లల్లోకి తరలించాలని కేటీఆర్ చెప్పారని గుర్తు చేశారు. మీరు చేస్తే మంచి, మేము చేస్తే మాత్రం తప్పా: మూసీకి ఇరువైపులా 50 మీటర్లను బఫర్‌జోన్‌గా గుర్తించాలని జీవో జారీ చేసిందని,

..మిగతా 2లో

### బ్యాంకాక్‌లో

## ఘోర ప్రమాదం

మంటల్లో చిక్కుకొన్న స్కూల్ బస్సు

25 మంది చిన్నారులు మృతి



**బ్యాంకాక్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు):** థాయ్ లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకొంది. పాఠశాల విద్యార్థులు, వారి టీచర్‌ను తీసుకెళుతున్న ఓ బస్సు మంటల్లో చిక్కుకొంది. సెంట్రల్ ఉతాయ్ థాని ప్రావిన్స్ నుంచి తిరిగివస్తుండగా జరిగిన ఈ ఘటనలో మొత్తం 25మంది చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 44 మంది ప్రయాణిస్తున్నారు. థాయ్‌ల్యాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రా మృతులకు సంతాపం తెలిపారు. విద్యార్థులు ట్రిప్‌కు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకొంది. థాయ్‌ల్యాండ్ రవాణశాఖా మంత్రి ఈ ప్రమాదం వివరాలను వెల్లడించింది. "మొత్తం 44 మంది బస్సులో ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. వీరిలో 38 మంది విద్యార్థులు,

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి కవిత

## జైలులో ఉండగా పలు ఆరోగ్య సమస్యలు

**హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు):** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మంగళవారం వైద్యపరీక్షల కోసం గచ్చిబౌలి ఏఐజీ హాస్పిటల్లో చేరారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో తీహార్ జైలులో ఉన్న సమయంలో గైనిక్ సమస్యలు, తీవ్ర జ్వరంతో పలుసార్లు తీవ్ర అనారోగ్యానికి కవిత గురైన విషయం తెలిసిందే. గతంలో తిహాడ్ జైల్లో ఉండగా కవిత రెండుసార్లు అస్వస్థతకు లోనయ్యారు. జూలై 16న తొలిసారిగా కవితను ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రెండు రోజుల తర్వాత జూలై 18న ఆమెను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరచగా, తనకు ఎదురవుతున్న అనారోగ్య సమస్యలను జడ్జి కావేరి బవేజా దృష్టికి కవిత తీసుకెళ్లారు.ఆ తర్వాత ఆమె విజ్ఞప్తి మేరకు ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలకు అనుమతి ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగుపడలేదు. జైలు వైద్యులే కవితకు వైద్యం అందించారు. ఆ తర్వాత ఆగస్టు-22న మరోసారి కవిత అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి, తిరిగి జైలుకు తీసుకెళ్లారు. కొంతకాలంగా కవిత గైనిక్ సమస్యలతో బాధపడుతూ ఉండటం.. దీనికి తోడు ఇటీవల వైరల్ జ్వరం బారినపడ్డారు. దీంతో.. కవిత భర్త అనిల్ సమక్షంలో వైద్య పరీక్షలు చేశారు. కవిత జైల్లో ఉండగా 11 కిలోల బరువు తగ్గారు.

## మూసీ నది ప్రక్షాళనలో

# మరో అడుగు

మొదటి పేజీ తరువాయి...

ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పర్యవేక్షించారు.
హైదరాబాద్ మహానగరంలో మూసీ నది ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకు వేస్తోంది. అందులో భాగంగా తొలి దశలో మూసీ నది గర్భంలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని నిర్ణయించిన ప్రభుత్వం వారం రోజుల నుంచి సర్వే నిర్వహించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ప్రవహించే మూసీ నది గర్భంలో సుమారు 2 వేలకుపైగా నిర్మాణాలున్నట్లు గుర్తించి అందులో నివసిస్తున్న కుటుంబాలను ఖాళీ చేయించాలని రెవెన్యూ అధికారులకు సూచించింది.
పునరావాసం కల్పిస్తామని భరోసా : ఈ మేరకు రంగంలోకి దిగిన అధికారులు నదీ గర్భంలో ఉన్న నిర్మాణాలకు మార్కింగ్ చేసి బాధిత కుటుంబాలకు జీహెచ్ఎంసీ పరిధిలోనే పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. నగరంలోని 14 చోట్ల రెండు పడకల గదుల గృహ సముదాయాల్లో ఖాళీగా ఉన్న వాటిని కేటాయించి నిర్వాసితులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అధికారుల సూచనలతో నదీ గర్భంలో ఇబ్బందికరమైన పరిస్థితుల్లో జీవిస్తున్న పలు కుటుంబాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇళ్లను ఖాళీ చేశాయి. తమకు కేటాయించిన రెండు పడకల గదుల ఇళ్లకు తరలివెళ్లిపోయారు. దీంతో తర్వాత ప్రక్రియగా ఆ నిర్మాణాలను కూల్చివేయాలని నిర్ణయించిన ప్రభుత్వం నేటి నుంచి మూసీ నది గర్భంలో ఉన్న నివాసాల కూల్చివేతలు మొదలుపెట్టింది.
హైదరాబాద్ జిల్లా పరిధిలోని చాదర్ ఘాట్, శంకర్ నగర్, వినాయకవీధి, రసుల్ పురా, మూసానగర్ ప్రాంతాల్లోని నివాసాలను కూల్చివేశారు. సుమారు 200కుపైగా కుటుంబాలు నదీ గర్భంలో ఇక్కడ ఏళ్ల తరబడి జీవిస్తున్నాయి. అందులో కొంత మంది ఖాళీ చేసి వెళ్లిపోవడంతో మలక్ పేట ఎమ్మెల్యే బలాల సహకారంతో సుమారు 100 మంది కూలీలతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఇటీవల హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో కూల్చివేతల విషయంలో జేసీబీలను దూరంగా పెట్టిన రెవెన్యూ అధికారులు కూలీల సహాయంతో మూసీ నది గర్భంలోని నిర్మాణాలను ధ్వంసం చేశారు. సమ్మెట, గుణపాలతో



ఇళ్లపై కూలీలు విరుచుకుపడి ఒక్కో ఇంటికి పెకిలించారు. ఒక్క శంకర్ నగర్ లోనే 100కుపైగా నివాసాలను కూల్చివేశారు. కొన్నింటిని పూర్తిగా ధ్వంసం చేయగా మరికొన్ని నివాసాలను పాక్షికంగా కూల్చివేశారు.
ఓ వైపు కూలీల కూల్చివేతలు జరుగుతుండగా మరోవైపు పలు బాధిత కుటుంబాలు పోలీసులు, రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగాయి. తమ సామాగ్రిని తీసుకెళ్లడానికి సమయం ఇవ్వాలంటూ మండిపడ్డారు. దీంతో శంకర్ నగర్ లో కాసేపు స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకొని బాధిత కుటుంబాలకు సర్ది చెప్పారు. ఒక్కొక్కటిగా ఇళ్లను కూల్చివేస్తుండటంతో తమ నివాసాల్లో ఉన్న సామాగ్రిని సర్దుకొని బయటపెట్టారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన డీసీఎంలు, మినీ వ్యాన్లలో సామ్రాగిని తరలించారు.
ఇంటి యజమానులు ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి వెళ్లిపోగా అద్దెకున్న వారు సమీప బంధువుల ఇళ్లకు, కొత్తగా అద్దెకు తీసుకున్న చోటుకు వెళ్లిపోయారు. అయితే కొంతమంది పాత ఇనుమ సామాను వ్యాపారులు అక్కడికి చేరుకొని ఇదే అదనపుగా భావించి ఖాళీ చేసిన నివాసాల్లోని ఇనుప దర్వాజలు, తలుపులు, కిటికీలు, విద్యుత్ సామాగ్రిని తమ వ్యక్తిగత వాహనాల్లో తరలించడం గమనార్హం. కూల్చివేతల ప్రాంతాల్లో ఎలాంటి ఆటంకం లేకుండా పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పర్యవేక్షించారు. రేపు మిగతా ప్రాంతాల్లోనూ అక్రమ నిర్మాణాలను కూల్చివేయనున్నారు. ఈ వారంలో మార్కింగ్ చేసిన నిర్మాణాలన్నీ కూల్చివేసి ఆ శిథిలాలను తొలగించి ఆ భూములను చదును చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.



# బ్యాంకాక్‌లో ఘోర ప్రమాదం

మొదటి పేజీ తరువాయి...

ఆరుగురు టీచర్లు ఉన్నారు. ఇప్పటివరకు 16 మంది విద్యార్థులు, ముగ్గురు టీచర్లను రక్షించారు. మిగిలిన వారి విషయంపై ఇంకా స్పష్టత లేదు" అని పేర్కొన్నారు. ఇటీరియర్ మంత్రి అనుతిన్ చర్నవిరకుల్ మాట్లాడుతూ మృతుల సంఖ్యను ఇంకా ధ్రువీకరించలేమని పేర్కొన్నారు. ఘటనా స్థలంలో దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదన్నారు. ప్రమాదం నుంచి బయటపడిన వారి సంఖ్య ఆధారంగా.. 25 మంది చనిపోయి ఉండొచ్చన్నారు. ప్రమాదం జరిగి గంటలు గడుస్తున్నా.. మృతదేహాలు ఇంకా బస్సులోనే ఉండిపోవడం గమనార్హం. ఈ ప్రమాదంపై ఆన్‌లైన్‌లో పోస్టు అయిన వీడియోల్లో బస్సు నుంచి నల్లటి పొగ, భారీగా మంటలు ఎగసిపడుతున్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల వయస్సు ఇతర వివరాలు వెల్లడికావాల్సి ఉంది. ఒక టైరు పేలిపోయినట్లు కొందరు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న ఓ సంస్థ తాము 10కిపైగా మృతదేహాలను చూసినట్లు ఫేస్‌బుక్‌లో పేర్కొంది.

## మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

# ఏర్పాటు చేసిందెవరు?

మొదటి పేజీ తరువాయి...

మూసీలో 8,480 అక్రమ కట్టడాలు ఉన్నాయని గత ప్రభుత్వమే లెక్క తేల్చిందన్నారు. మూసీ నదికి హద్దుల గుర్తింపుపై సర్వే కూడా పూర్తి చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాగితాల వరకే మూసీ ప్రక్షాళనను పరిమితం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుంటే మాత్రం రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. సమస్యను మరింత జఠిలం చేస్తూ బురద జల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. మల్లన్నసాగర్ భూనిర్వాసితులను ఎంత నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టారో మర్చిపోయారని విమర్శించారు. మూసీ బఫర్‌జోన్ గుర్తింపుపై గత ప్రభుత్వమే జీవోఎంఎస్ 7ను జారీ చేసిందని, ఆ జీవో ప్రకారమే మేము ముందుకెళుతున్నామని స్పష్టం చేశారు. మీరు చేస్తే మంచి, మేము చేస్తే మాత్రం తప్పా అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు.

# మూసీ ప్రక్షాళన పేరుతో లూటీ

మొదటి పేజీ తరువాయి...

మహమూద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, సుధీర్ రెడ్డితో కలిసి కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసిన వారిపై సీఎం పగపట్టారన్నారు. గరీబోళ్లంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నరని, వాళ్ల బతుకులను ఆగం చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. మూసీమే లూటో.. ఢిల్లీ మే బాంటో అనేది కాంగ్రెస్ నినాదమని విమర్శించారు. మీ ఇండ్ల మీదకు బుల్డోజర్ వస్తే కంటె అడ్డుపెట్టాలన్నారు. రేవంత్ రెడ్డి కాదు.. ఆయన తాత వచ్చినా ఏమీ చేయలేరన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సగం డబ్బులతో మూసీ ప్రక్షాళన చేపట్టారని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంత వాసులను అడవిలోకి పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు కడతామంటూ కూల్చుతున్నారని చెప్పారు. పేదల ఇళ్లు కూల్చుతుంటే ఈ ప్రాంత ఎంపీ ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడపలుక్కున్నారా? అని అడిగారు. పేదలకు కష్టం వస్తే అండగా ఉండేవాడే దేవుడని అన్నారు. రేవంత్ రెడ్డి నీవు మొగోడివైతే నీవు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బ్రోకర్లు విడగొట్టే ప్రయత్నం చేస్తారని, మన హక్కులను లాక్కునే హక్కు ఎవరికీ లేదన్నారు. మీకోసం బీఆర్ఎస్ తరఫున కోర్టులో కొట్లాడుతామని భరోసానిచ్చారు.

# తెలుగు రాష్ట్రాలకు వరద సాయం ప్రకటించిన కేంద్రం

## ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,036 కోట్లు, తెలంగాణకు రూ.416.80 కోట్లు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు):** దేశ వ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాలకు కేంద్ర హోం శాఖ రూ.5,858.60 కోట్లు విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ వాటాలో భాగంగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డీఆర్ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డీఆర్ఎఫ్) నుంచి 14 రాష్ట్రాలకు ఈ మేరకు హోంశాఖ నిధులు మంజూరు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర బృందాలు.. నష్టాన్ని అంచనా వేస్తూ ఇచ్చిన నివేదిక మేరకు తక్షణసాయంగా ఈ నిధులు కేటాయించింది. కేంద్ర బృందాల నుంచి పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని నిధులు మంజూరు చేయనున్నట్లు హోంశాఖ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,036 కోట్లు, తెలంగాణకు రూ.416.80 కోట్లు మంజూరు చేసింది. అత్యధికంగా మహారాష్ట్రకు 1,492 కోట్ల వరద సాయం ప్రకటించింది.



# హైదరాబాద్‌లో డిజె సౌండ్‌లపై నిషేధం

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## ఉత్తర్వులు ఇచ్చిన కమిషనర్ సివి ఆనంద్

**హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు):** హైదరాబాద్‌లో డిజె సౌండ్‌లపై పోలీసులు నిషేధం విధించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఊరేగింపులు, వేడుకల సందర్భంగా విపరీత శబ్ద కాలుష్యానికి దారి తీస్తున్న డీజేలపై హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. డీజే సౌండ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని 100కు భారీ సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో సమీక్షించిన పోలీసులు.. డీజేలపై నిషేధం విధించాలని నిర్ణయించారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగర పరిధిలో ఇకపై మతపరమైన ర్యాలీల్లో ఎలాంటి డీజేలనూ ఉపయోగించ కూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. భారీ శబ్దాలతో డీజేలు పెట్టి సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ మార్గదర్శకాలు జారీ చేశారు. అయితే సౌండ్ సిస్టమ్‌లను మాత్రం పరిమిత స్థాయిలో అనుమతిస్తున్నట్లు వెల్లడించారు. సౌండ్ సిస్టమ్ పెట్టడానికి కూడా పోలీస్ క్లియరెన్స్ తప్పనిసరని స్పష్టం చేశారు. నాలుగు జోన్లలో సౌండ్ సిస్టమ్‌లు పెట్టడానికి డెసిబిల్స్‌ను నిర్దేశిస్తూ కొత్త మార్గదర్శకాలు జారీ చేశారు. జనావాసాల ప్రాంతంలో ఉదయం 55 డెసిబెల్స్‌కు మించి పెట్టరాదని తెలిపారు. అలాగే రాత్రి వేళల్లో 45డెసిబెల్స్‌కు మించరాదని హుకుం జారీ చేశారు. మతపరమైన ర్యాలీల్లో బాణసంచా కాల్చడం పూర్తిగా నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా డీజేలు పెట్టినా, సౌండ్ సిస్టమ్స్ పరిమితికి మించి పెద్దపెద్ద శబ్దాలతో హంగామా చేసినా ఐదు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.లక్షల జరిమానా విధిస్తామని తెలిపారు. పదే పదే నిబంధనలు ఉల్లంఘిస్తే రోజుకు రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తామని నగర పోలీసులు హెచ్చరించారు.



# బతుకమ్మ, దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయండి

## రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ మంత్రి కొండ సురేఖ

## వరంగల్ నగర మేయర్, జిల్లా కలెక్టర్, సిపి, అధికారులతో మంత్రి సమీక్ష

**వరంగల్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు):** బతుకమ్మ, దసరా పండుగ ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కరిమాబాద్ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధ్యక్షతన జిల్లా యంత్రాంగం, జిడబ్ల్యూ ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో కరీమాబాద్ రంగలీల మైదానం(ఉర్సు గుట్ట) లో సద్దుల బతుకమ్మ, దసరా పర్వదినం సందర్భంగా నిర్వహించిన సమావేశానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగర మేయర్ గుండు సుధారాణి, నగర పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జిల్లా కలెక్టర్ డా సత్య శారద, బల్దియా కమీషనర్ డా.అశ్విని తానాజీ వాకడే లతో కలిసి సమీక్షించి సమర్ధ నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మ జరుపుకుంటామని వారి సౌకర్యార్థం అవసరమగు ఏర్పాట్లు చేయాలన్నారు. బతుకమ్మ జరుపుకునే అన్ని ప్రాంతాల వద్ద మైదానం చదును, రహదారిపై గుంతలు పూడ్చాలని, డస్టింగ్, లైటింగ్, మంచినీటి సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలతో పాటు చెరువులలో గుర్రెపు డెక్క తొలగించాలని, ఆయా పనులు వేగవంతంగా చేపట్టి బుధవారం నాటికి పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ ఆట స్థలాల వద్ద ప్రతిరోజు శుభ్రం చేయాలని మునిసిపల్ అధికారులను సూచించారు. దసరా పర్వదినం సందర్భంగా రంగలిలా మైదానంలో అంగరంగ వైభవంగా జరుపుకొనే వేడుకలకు దసరా కమిటీ కోరిన విధంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు.తగినంత లైటింగ్ పారిశుద్ధ్యం మంచినీటి సౌకర్యం, సీటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, మహిళ



పురుషుల పోలీసులతో పటిష్ట పోలీసు బందోబస్తు, సిసి కెమెరాల ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా, నగరం నలుమూలల నుండి ప్రజలు వచ్చేలా టిఎస్ఆర్టిసి ద్వారా బస్సుల ఏర్పాటు, పార్కింగ్, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వైద్య అంబులెన్స్ లు, అగ్నిమాపక యంత్రం ఏర్పాటు, ఆయా చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. తెలంగాణ సంప్రదాయం, సాంస్కృతి ప్రతిబింబించే విధంగా సాంస్కృతిక కార్యక్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన అంతర్గత రహదారులలో గుంతలను పూడ్చాలన్నారు. ఏలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అంకిత భావంతో ఏర్పాట్లు చేయాలని మంత్రి కోరారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అన్ని విభాగాల అధికారుల సహకారంతో పండుగల ఏర్పాట్లను విజయవంతం చేయాలని బల్దియా కమిషనర్ ఆయా విభాగాలతో ఇప్పటికే సమావేశాలు ఏర్పాటు చేసి విజయవంతం చేయడానికి తగు సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. లైటింగ్, డస్టింగ్, బల్దియా వ్యాప్తంగా ఉన్న అన్ని చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, గతంలో మాదిరిగా ఆలయాలకు లైటింగ్ ఏర్పాట్లు చేయడంతో పాటు సద్దుల బతుకమ్మ పండుగ వరకు చెరువుల్లో గుర్రపు డెక్క సకాలంలో తొలగింపుతో పాటు ప్రణాళిక ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయుటకు జీడబ్ల్యూఎంసి ముందుకు వెళుతున్నదని అన్నారు. మంత్రివర్యుల సూచన మేరకు బల్దియా తరపున చేపట్టవలసిన కార్యక్రమాలను సమీక్షించుకొని ఏమైనా అసంపూర్తిగా మిగిలియున్న పనులు ఉంటే కమీషనర్ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటారని బల్దియా తరపున అదనపు ఏర్పాట్లు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని నగర పరిధిలోని చెరువుల వద్ద చేయాల్సిన ఏర్పాట్ల గురించి కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి వేగవంతంగా పూర్తి చేయుటకు అధికారులకు సూచనలు చేశారని ఈ సందర్భంగా మేయర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ దసరా నిర్వహించుకొనుటకు శాఖల అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. బల్దియా సంబంధిత శాఖల అధికారులతో ఆయా పనులు త్వరితంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుటకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు భారీ వాహనాలు ప్రధాన రహదారిపై రాకుండా మళ్లించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, పల్లం పద్మ రవి, డిసిపి సలీమా, అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, అదనపు కమిషనర్ రాజేందర్ రెడ్డి, పోలీస్, ఇరిగేషన్ ఎన్పీడీసీఎల్, ఫైర్, మెడికల్ అండ్ హెల్త్, తదితర శాఖల అధికారులు, కరీమాబాద్ దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్, మెడిది మధుసూదన్,సందీప్ రంగశాయిపేట దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుండు పూర్ణ చందర్, రాంమూర్తి, కరుణాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# బుల్డోజర్ కూల్చివేతలపై మార్గదర్శకాలు: సుప్రీం

హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు): బుల్డోజర్ కూల్చివేతలపై మార్గదర్శకాలను జారీ చేస్తామని సుప్రీంకోర్టు మంగళవారం చెప్పింది. ఏదో ఓ మతానికి కాకుండా ప్రజలందరికీ వర్తించే విధంగా ఈ మార్గదర్శకాలు ఉంటాయని తెలిపింది. ఓ వ్యక్తి ఏదైనా కేసులో నిందితుడిగా ఉండటం కానీ, దోషిగా నిర్ధారణ కావడం కానీ, ఆ వ్యక్తి ఇంటిని కూల్చేయడానికి తగిన కారణం కాబోదని స్పష్టం చేసింది. అయితే, ఆక్రమణదారులను రక్షించే విధంగా ఈ మార్గదర్శకాలు ఉండబోవని వివరించింది. గుడులు, గురుద్వారాలు, దర్గాలు వంటి మతపరమైన కట్టడాలు ప్రజలకు ఆటంకం కలిగించే విధంగా రోడ్లు, జలాశయాలు, రైలు మార్గాలు వంటివాటిపై ఉండకూడదని వివరించింది. ఈ అంశంపై దాఖలైన పిటిషన్లపై తీర్పును రిజర్వు చేసింది.

# ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం

**సుమారు 500 మిస్సైల్స్, రాకెట్ల ప్రయోగం**
**అమెరికా హెచ్చరించిన కొద్ది గంటల్లోనే దాడి**
**బాంబుల మోతతో దద్దరిల్లిన టెల్ అవీవ్**
**వేలాది మంది పౌరులు సురక్షిత ప్రాంతాలకు**
**ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు**
**ఇరాన్ క్షిపణులను కూల్చేయాలని సైన్యానికి బైడెన్ ఆదేశాలు**
**పశ్చిమాసియాలో మరింత తీవ్రమైన ఉద్రిక్తతలు**
**లెబనాన్‌లో భూతల దాడులకు దిగిన ఇజ్రాయెల్**



జెరూసలేం, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు): పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. ఇజ్రాయెల్-హమాస్, హెజ్బొల్లా మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇప్పుడు ఇరాన్ కూడా ప్రత్యక్షంగా దిగింది. మంగళవారం సుమారు 500 క్షిపణులు, రాకెట్లతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. దీంతో టెల్ అవీవ్ బాంబుల మోతతో దద్దరిల్లింది. పలు భవనాలు, వ్యాపార సంస్థలు దెబ్బతిన్నాయి. పౌరులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఇజ్రాయల్ హెచ్చరికలు జారీ చేసింది. వేలాది మందిని బాంబు షెల్టర్లకు తరలించింది. దాడులను అడ్డుకోవడానికి తన రక్షణ వ్యవస్థను సిద్ధం చేసింది. లెబనాన్‌లో హెజ్బొల్లా నేతల మరణాలకు ప్రతీకారంగా ఇరాన్ ఈ దాడులకు దిగింది. ఇరాన్ దాడులను ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) కూడా ఎక్స్‌లో నిర్ధారించింది. ఇరాన్ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ సాయంత్రం అత్యవసరంగా సమావేశమై పరిస్థితులపై చర్చించింది. ఏడాది కాలంలో సెక్యూరిటీ క్యాబినెట్ ఇలా సమావేశం కావడం ఇదే ప్రథమం. కాగా, దాడిని ఇరాన్ నిర్ధారించింది. ఇజ్రాయెల్‌పై డజన్లకొద్దీ బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించినట్టు అధికారికంగా ప్రకటించింది. ఈ దాడులకు ఇజ్రాయెల్ ప్రతిస్పందిస్తే మరింత తీవ్రంగా దాడులు చేస్తామని హెచ్చరించింది.

### అమెరికా హెచ్చరించిన విధంగానే..

ఇరాన్ తక్షణం క్షిపణి దాడులు చేయడానికి సిద్ధంగా ఉందని అమెరికా ప్రకటించిన కొద్ది గంటల్లోనే దానిని నిజం చేస్తూ ఇరాన్ దాడికి దిగడం గమనార్హం. ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడికి దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, అమెరికా చూస్తూ ఊరుకోదని ఉన్నతాధికారి ఒకరు హెచ్చరిక కూడా చేశారు. అయితే దీనిని ఇరాన్ బేఖాతరు చేస్తూ దాడికి దిగింది. దీనిపై ఇజ్రాయెల్ మిలటరీ స్పందిస్తూ ఇప్పటివరకు ఇరాన్ వైపు నుంచి ఎలాంటి ప్రమాదాన్ని గుర్తించలేదని, అయితే ఈ దాడితో తాము అప్రమత్తమయ్యామని, తమ రక్షణ, దాడి వ్యవస్థలను దానికి అనుగుణంగా సిద్ధం చేసినట్టు మిలటరీ చీఫ్ లాయిడ్ ఆస్టిన్ తెలిపారు. సెంట్రల్ ఇజ్రాయెల్‌లో సైరన్ల ద్వారా పౌరులను అప్రమత్తం చేసినట్టు ఆయన చెప్పారు. అయితే దాడులతో ఏ ప్రాంతాలు దెబ్బతిన్నవి, మరణాల గురించి ఆయన వివరించ లేదు. మరోవైపు అమెరికా ఇజ్రాయెల్‌కు మద్దతు తెలిపింది. ఇరాన్ క్షిపణులను కూల్చేయాలని బైడెన్ అమెరికా సైన్యాన్ని ఆదేశించారు. కాగా, ఇరాన్ దాడి నేపథ్యంలో భారతీయులంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, బయటకు రావద్దని ఇజ్రాయెల్‌లోని భారత ఎంబసీ మన దేశ పౌరులకు విజ్ఞప్తి చేసింది.

### టెల్ అవీవ్‌లో ఉగ్ర దాడి

టెల్ అవీవ్‌లోని జఫాలో ఉగ్ర దాడి జరిరింది. మంగళవారం సాయంత్రం జెరూసలేం వీధిలో కొందరు ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో నలుగురు మరణించగా, ఏడుగురు గాయపడ్డారని ఇజ్రాయెల్ పోలీసులు తెలిపారు. ఉగ్రవాదులిద్దరూ పోలీస్ కాల్పుల్లో మరణించారు. రైలులోంచి దిగిన ఈ ఇద్దరు ఉగ్రవాదులు తుపాకులతో విచక్షణా రహితంగా కాల్పులు జరిపినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో పౌరులు చాలామంది నేలపై బోర్లా పడుకుని కాల్పుల నుంచి తప్పించుకోగా, నలుగురు మరణించారు. కొందరు గాయపడ్డారు.

### లెబనాన్‌పై భూతల దాడులు

లెబనాన్‌లో భూతల దాడులను ఇజ్రాయెల్ ప్రారంభించింది. ఇప్పటివరకు వైమానిక దాడులతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్.. తాజాగా లెబనాన్ భూభాగంలోకి ప్రవేశించి దాడులు మొదలుపెట్టింది. అందులో భాగంగా లెబనాన్ సరిహద్దు సమీపంలో ఉన్న సుమారు రెండు డజన్ల గ్రామాల ప్రజలను తక్షణం ఇళ్లు వదిలి వెళ్లిపోవాలంటూ ఇజ్రాయెల్ మిలటరీ మంగళవారం హెచ్చరికలు జారీ చేసింది. అలాగే తమ వాహనాలను ఉత్తర ప్రాంతం నుంచి దక్షిణ లిటానీ నదివైపు తరలించవద్దంటూ పౌరులకు ఎక్స్‌లో హెచ్చరికలు చేయగా, తమ భూభాగంలోకి ఇజ్రాయెల్ సైన్యం ప్రవేశించినట్టు వచ్చిన వార్తలను హెజ్బొల్లా ఖండించింది. లెబనాన్‌లోకి ప్రవేశించే ఏ చర్యనైనా దీటుగా ఎదుర్కొంటామని హెజ్బొల్లా ప్రతినిధి మహమ్మద్ అఫిఫ్ పేర్కొన్నారు.

### మొస్సాద్ హెడ్ క్వార్టర్స్‌పై దాడి

టెల్ అవీవ్‌కు సమీపంలోని గిల్లాట్ ఇజ్రాయెల్ మిలటరీ ఇంటెలిజెన్స్ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్టు హెజ్బొల్లా ప్రకటించింది. మిలటరీ ఇంటెలిజెన్స్ యూనిట్ 8200, టెల్ అవీవ్ శివారులోని మొస్సాద్ హెడ్ క్వార్టర్స్‌పై నాలుగు రాకెట్లను ప్రయోగించినట్టు తెలిపింది. అలాగే సెంట్రల్ ఇజ్రాయెల్‌పై మధ్యంతర క్షిపణులను ప్రయోగించామని, ఇది కేవలం ఆరంభం మాత్రమేని పేర్కొంది.

### మా గూఢచారి చీఫ్ మొస్సాద్‌కు ఏజెంట్: ఇరాన్ మాజీ అధ్యక్షుడు

ఇజ్రాయెల్ రహస్య గూఢచార వ్యవస్థ మొస్సాద్ ఇరాన్ సీక్రెట్ సర్వీస్‌లోకి చొరబడిందని ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ అహ్మదీనెజాద్ ఆరోపించారు. సీఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ మొస్సాద్ కార్యకలాపాలను అడ్డుకోవడానికి ఇరాన్ ఏర్పాటు చేసిన సీక్రెట్ సర్వీస్ చీఫ్ తమను మోసం చేసి మొస్సాద్‌కు ఏజెంట్‌గా మారిపోయాడని ఆరోపించారు. అతనితో పాటు మరో 20 మంది ఇజ్రాయెల్‌కు డబుల్ ఏజెంట్లుగా పనిచేశారన్నారు. వీరంతా ఇరాన్‌లో జరిగే అనేక రహస్య ఆపరేషన్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇజ్రాయెల్‌కు అందజేసేవారని, పలు డాక్యుమెంట్లు అపహరించే వారని, అలా అపహరించిన వాటిలో ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయని ఆయన వెల్లడించారు. వీరి చర్య కారణంగానే ఇరాన్ న్యూక్లియర్ సైంటిస్టుల మరణం సంభవించిందన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ గతంలో ఇరాన్ అణు కార్యక్రమాల గురించి వెల్లడిస్తూ వాటి పత్రాల గురించి తెలిపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

# హైడ్రా జీవో 99 చట్టబద్ధతను సవాల్ చేస్తూ పిటిషన్

## మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు



హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు): హైడ్రా ఏర్పాటుపై తీసుకొచ్చిన జీవో 99పై మంగళవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ జీవో అమలును నిలిపిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం ప్రభుత్వం కౌంటరు దాఖలు చేసేదాకా జీవో అమలును నిలిపిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది. హైడ్రాను ఏర్పాటు చేస్తూ ఇచ్చిన జీవో 99పై ప్రభుత్వం కౌంటరు దాఖలు చేసేదాకా జీవో అమలును నిలిపిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. హైడ్రా ఏర్పాటుపై కౌంటరు దాఖలు చేసిన తరువాత ఒకేసారి పిటిషన్‌పై విచారణను చేపట్టి నిర్ణయాన్ని వెలువరిస్తామని పేర్కొంది. ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేస్తూ తీసుకువచ్చి జీవో 99 చట్టబద్ధతను సవాలు చేస్తూ హైదరాబాద్ నానక్‌రాంగూడకు చెందిన లక్ష్మి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున కౌంటరు దాఖలు చేస్తామని, దీనికి కొంత గడువు కావాలని అదనపు అడ్వకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి కోరారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ జీవో అమలును నిలిపిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్లో 10.24 ఎకరాల్లో జోక్యం చేసుకోకుండా ఆదేశాలివ్వాలన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి జీవో 99కు సంబంధించి ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని, ప్రభుత్వం కౌంటరు దాఖలు చేశాక విచారణ చేపడతామంటూ విచారణను ఈనెల 15కు వాయిదా వేశారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై హైకోర్టు : మరోవైపు గ్రూప్-1 పరీక్షలపై హైకోర్టులో భిన్న వాదనలు జరిగాయి. పరీక్షల నిర్వహణలో టీజీపీఎస్సీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పిటిషనర్ల తరపు న్యాయవాదులు హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. గత వైఫల్యాల నుంచి టీజీపీఎస్సీ తప్పులు సరిదిద్దుకోవడంలేదని, పరీక్షల నిర్వహణలో అదే తరహాలో నిరక్ష్యంగా వ్యవహరిస్తూ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందన్నారు. గ్రూప్-1 పోస్టుల భర్తీ నిమిత్తం 2022లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని, ప్రాథమిక కీలో తప్పులున్నాయని వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ గతంలో గ్రూప్-1 నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ ఇదే హైకోర్టు పరీక్షను రద్దు చేసిందని, చేసిన తప్పును సరిదిద్దుకోవండా సుప్రీం కోర్టుదాకా వెళ్లిందన్నారు. టీజీపీఎస్సీ నిర్వాకం వల్ల ఇప్పటికే చాలా ఇబ్బందులున్నాయని మరిన్ని సృష్టించడం తమకు ఇష్టం లేదంటూ సుప్రీం కోర్టు ఎస్ఎల్పిని కొట్టివేసిందన్నారు. కొన్ని వందల పోస్టుల భర్తీ నిమిత్తం నిర్వహిస్తున్న పరీక్షలకు లక్షల మంది దరఖాస్తులు చేశారని, ఈ దశలో పారదర్శకంగా, నిస్పాక్షికంగా నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వెలువరించిన కీ లో కూడా 7 ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఉన్నాయని తెలిపారు. కీలో తప్పులున్నాయని నిపుణులు చెప్పినా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఈ ప్రశ్నలను తొలగించి తాజా కీని రూపొందించి అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాల్సి ఉందన్నారు. 2011 నుంచి గ్రూప్-1 నియామకాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. త్వరలో మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నందున దీనిపై సత్వరం నిర్ణయం తీసుకోవాలని అభ్యర్థించారు. టీజీపీఎస్సీ వాదనల నిమిత్తం న్యాయమూర్తి విచారణను ఈనెల 3వ తేదీకి వాయిదా వేశారు.

# హైదరాబాద్‌లో భారీగా హవాలా మనీ

## రూ. 1.21 కోట్ల నగదు సీజ్



హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు): హైదరాబాద్ సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా హవాలా డబ్బు పట్టుపడింది. వాహన తనిఖీలలో రూ.1 కోటి 21 లక్షలు పట్టుబడింది. సుల్తాన్ బజార్ పోలీసులు మంగళవారం సాయంత్రం బొగ్గులకుంటలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా బైక్ పై వస్తున్న ఇద్దరిని పోలీసులు ఆపేందుకు యత్నించారు. వారు పోలీసులను తప్పించుకొని పోవడంతో కోఠి హనుమాన్ టెక్డి వద్ద వారిని పోలీసులు పట్టుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లక్ష్మణ్ (27), వసంత్ ( 24) లు అనుమానాస్పదంగా, ఓ బ్యాగ్‌ను తరలిస్తుండటం గమనించారు. ఆ బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో కోటి రూపాయల నగదు పట్టుబడింది. వారిని విచారించగా, తమకు ఆ డబ్బుతో ఎలాంటి సంబంధం లేదని తన ప్రతినిధి ఆదేశాల మేరకు డబ్బులను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వారి ఇచ్చిన సమాచారంతో హనుమాన్ వ్యాయామశాల వద్ద ఉన్న ఓ అపార్ట్మెంట్‌లో తనిఖీ చేయగా, అక్కడ రూ.21 లక్షలు పట్టుబడ్డాయి. అక్కడ ఉన్న మరోవ్యక్తి తరుణ్‌ను విచారించగా, ముంబయిలో ఉండే బబ్లూ అనే హవాలా వ్యాపారి ఆదేశాల అనుసారంగా, తాము పని చేస్తున్నామని తరుణ్ తెలిపాడు. నగరంలో ఉండే వ్యాపారుల నుంచి ఈ లావాదేవీలు సాగిస్తున్నట్లు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వెల్లడించారు. హవాలా డబ్బు తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.1.21 కోట్ల నగదు సీజ్ చేసి ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు బబ్లూను త్వరలో అరెస్ట్ చేస్తామని డీసీపీ వివరించారు.

# హైడ్రాపై విష ప్రచారం

## కేటీఆర్, హరీశ్‌రావు రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయాలని చూస్తున్నారు

## కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు



హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు): మూసీ ప్రక్షాళనపై రాద్ధాంతం చేస్తున్న బీఆర్ఎస్, మల్లన్న సాగర్ బాధితులను ఎందుకు ఆదుకోలేదని కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు ప్రశ్నించారు. గజ్వేల్‌లో మల్లన్న సాగర్ బాధితులతో సమావేశమైన ఆయన, ప్రభుత్వం మంచి పనికి పూనుకుంటే బీఆర్ఎస్ నాయకులు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్ని రెచ్చగొడుతున్నారని ఆక్షేపించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేస్తుందన్న మైనంపల్లి, నిర్వాసితులకు బాసటగా నిలిచేందుకు అన్ని పార్టీలు ముందుకురావాలని కోరారు. బీజేపీతో కుమ్మక్కు అవుదామని బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ నమ్మదని, ఇక ఆ పార్టీ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కపూర్‌లోని మల్లన్న సాగర్‌ను సందర్శించిన మైనంపల్లి, గులాబీ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలో కొంతమందికి కాలేజీలు, పెట్రోల్ బంకులు ఉన్నాయని, వాటిని పేదల పేర్లతో కొందరు నిర్వహిస్తున్నారని మైనంపల్లి ఆరోపించారు. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టి పెట్టాలని కోరారు. సాగర్ ప్రభావంతో ముంపు గ్రామాలలో భూగర్భ జలాలు పెరగడంతో ఇండ్లలో నీరు వచ్చి చేరుతుందన్నారు. తమ కులస్థులే కొంతమంది పేదలను అడ్డం పెట్టుకుని హైడ్రా పేరుతో రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. హైడ్రాపై విష ప్రచారంతో చేయడం ద్వారా రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయాలని కేటీఆర్, హరీశ్‌రావులు ప్రయత్నిస్తున్నారని మైనంపల్లి ఆరోపించారు. పోలీసులతో రైతులను కొట్టించిన ఘనత కల్వకుంట్ల కుటుంబానిదే : దత్తత గ్రామం కోల్గురులో కొన్ని ఇళ్లను బుల్డోజర్లతో స్వయంగా కూల్చి వేయించిన హరీశ్‌రావు, ఇప్పుడు బుల్డోజర్లకు అడ్డం పడుకుంటా అని మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల గోడు మీకు పట్టదా? హైడ్రా బాధితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న హరీశ్‌రావు, మల్లన్నసాగర్ నిర్వాసితులకు తాను ఇచ్చిన హామీ ముందు నెరవేర్చాలని మైనంపల్లి డిమాండ్ చేశారు. పోలీసులతో రైతులను కొట్టించిన ఘనత కల్వకుంట్ల కుటుంబానికే దక్కిందన్నారు. మంచి ఉద్దేశంతో హైడ్రా ప్రారంభిస్తే కావాలని విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానెళ్లను అడ్డం పెట్టుకుని నెగటివ్ పోస్టులు పెడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చెరువులు, కుంటలు, నాళాలు కబ్జా అయ్యాయన్నారు. హరీశ్‌రావు మహానటుడు, ఆయన ఏడుపునకు ఆస్కార్ అవార్డు ఇవ్వాలి : మొన్నటి శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖర్చు చేసినట్టు కాంగ్రెస్, బీజేపీలు చేయలేదన్నారు. వెంకట్రామిరెడ్డిని మెదక్ ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయించి బలిపశువుని చేశారన్నారు. రూ.250 కోట్లు ఆయనతో ఖర్చు పెట్టించారని, అయిన ఆయనకి ఓట్లు వేయలేదన్నారు. కేసీఆర్ రాజు, కేటీఆర్ యువరాజు, యువరాజు పోస్టు కోసం హరీశ్‌రావు పోటీ పడుతున్నారాన్నారు. అజీజ్ నగర్ లో హరీశ్‌రావుకి ఫామ్ హౌస్ ఉందన్నారు. పేదోళ్ల కోసం తాము ప్రాణాలు ఇవ్వడానికి రెడీ అని, కమిషన్లు లేకుండా ఏ పనైనా చేశామని కేటీఆర్, హరీశ్‌రావులు ప్రమాణం చేయగలరా? అని మైనంపల్లి హనుమంతరావు ప్రశ్నించారు. హరీశ్ రావు మహానటుడని, ఆయన ఏడుపునకు ఆస్కార్ అవార్డు ఇవ్వాలని ఎద్దేవా చేశారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలే మంత్రి సురేఖపై ట్రోలింగ్ చేశారు

## సంస్కారహీనంగా ఆ పార్టీ సోషల్ మీడియా పోస్టులు

## ఎంపీ రఘునందన్ రావు



హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రభాత సూర్యుడు): బీఆర్ఎస్ సోషల్ మీడియాకు తల్లి, అక్క, చెల్లి మధ్య ఉండే సంబంధం తెలియకుండా సంస్కారహీనంగా పోస్టులు పెట్టిందని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా కొండా సురేఖ తొలిసారి దుబ్బాకకు కల్యాణ్ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి వచ్చినందుకు ఒక అక్కకు తమ్ముడిగా ఆమెను అడిగి మరీ నూలు పోగు దండ వేసినట్లు చెప్పారు. అలాంటి నూలు పోగు దండను ప్రధాని మోదీ వచ్చినప్పుడు కూడా వేశానని గుర్తు చేశారు.

అక్కకు జరిగిన అవమానానికి తమ్ముడిగా తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నానని రఘునందన్ రావు అన్నారు. అక్కకు మద్దతుగా ఒక వకీలుగా పోస్టులు పెట్టిన వారిని కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు. పోస్టు పెట్టిన అకౌంట్‌కు హరీశ్‌రావు, కేసీఆర్ ఫోటో ఉందన్నారు. బీఆర్ఎస్‌కు సోషల్ మీడియా మీద నియంత్రణ లేదని విమర్శించారు. పోస్టులు పెట్టిన వారు మీ వాళ్లు అయితే తీసుకొచ్చి పోలీసులకు అప్పగించండని డిమాండ్ చేశారు. మీకు సంబంధం లేని, మీరు జీతం ఇవ్వని వ్యక్తులు అయితే వచ్చి మీరు కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును ఉదేశిస్తూ అన్నారు.

'గతంలో ప్రధాని నరేంద్రమోదీకి కూడా నూలు పోగు దండ వేశాను. అలానే ఒక అక్కకు తమ్ముడిగా ఆమెను అడిగి మరీ నూలు పోగు దండ వేశాను. కానీ కొందరు అక్క, చెల్లి మధ్య ఉండే సంబంధం తెలియకుండా సంస్కారహీనంగా పోస్టులు పెట్టారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తు ఉన్న ఫొటో, హరీశ్‌రావు, కేటీఆర్ ఫొటోలున్న అకౌంట్ నుంచి ఈ పోస్టులు పెట్టారు. వెంటనే కేటీఆర్, హరీశ్‌రావు స్పందించి చర్యలు తీసుకోవాలి'- రఘునందన్ రావు, బీజేపీ మెదక్ ఎంపీ

కేటీఆర్, హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలి : కేటీఆర్, హరీశ్‌రావు దీనిపై స్పందించి సోషల్ మీడియాను కంట్రోల్ చేసుకుని క్షమాపణ చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. వ్యక్తుల వ్యక్తిత్వ హననం చేయడం మంచిది కాదని సూచించారు. మహిళల మీద బీఆర్ఎస్‌కు గౌరవం లేదన్నారు. తెలంగాణ తొలి కేబినెట్‌లో మహిళలకు చోటు ఇవ్వలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచే డబ్బుల తీసుకున్న వారు ఇలాంటి ట్రోలింగ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలే ట్రోలింగ్ చేశారని ఆరోపించారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# ప్రభాస్ మూవీలోకి మిథున్ చక్రవర్తి

సలార్', 'కల్కి' సినిమాల సక్సెస్‌తో రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ప్రభాస్ నెక్ట్స్ లైనప్‌తో కూడా ఫ్యాన్స్ ఖుషీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సీతారామం చిత్రంతో నేషనల్ వైడ్‌గా క్రేజ్ సంపాదించుకున్న డైరెక్టర్ హను రాఘవాపుడితో ఓ సినిమా చేయనుండటం ఫ్యాన్స్‌కి మరింత కిక్కునిచ్చింది. ఫౌజి వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. ఇప్పటికే ఈ సినిమాలో యూట్యూబ్ సెన్సేషన్ ఇమాన్వి ఇస్మాయిల్ తో పాటు లెజండరీ నటి జయప్రద నటించనుడటంతో సినీవర్గాలల్లో మూవీపై మరింత ఇంట్రెస్ట్ పెరిగింది. తాజాగా మరో లెజెండ్ ఈ సినిమాలో నటిస్తున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ప్రకటించడటంతో ఫ్యాన్స్ మరింత సంబరపడిపోతున్నారు. ఇటీవల రిలీజైన 'కల్కి 2898 సినిమాలో బాలీవుడ్ సూపర్ స్టార్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ ప్రభాస్ కోసం నటించి మెప్పించాడు. కేవలం యాక్ట్ చేశాడన్నట్లు కాకుండా సినిమాకే ఆయువు పట్టులా వ్యవహరించి తన యాక్టింగ్ ఇంప్యాక్ట్ చూపించాడు. తాజాగా భారతదేశ చలన చిత్ర రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ పాల్కే అవార్డ్ పొందిన మిథున్ చక్రవర్తిని హను రాఘవపూడి ఫౌజి సినిమా కోసం కాంటాక్ట్ అయ్యారు. ఆయన కూడా ఈ ప్రాజెక్ట్ కి ఓకే చెప్పేశారు. దీంతో మరోసారి ఇంకో బాలీవుడ్ లెజెండ్ ప్రభాస్ సినిమాలో కీలకం కానున్నాడు. గతంలో 'గోపాల గోపాల' చిత్రంలో




నెగిటివ్ షేడ్స్‌లో తన నటన ప్రావీణ్యంతో తెలుగు ప్రజలకు ఆయన పరిచయమే. గోపాల గోపాల ఒరిజినల్ వెర్షన్ ఓ మై గాడ్ మూవీలోను ఇదే పాత్రలో ఆయన నటించి అవార్డులు సాధించారు. అలాగే దేశంలోనే మూడో అత్యున్నత పురస్కారం పద్మభూషణ్‌తో పాటు 3 నేషనల్ అవార్డులు, రెండు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు సాధించారు. కాగా ఈ సినిమాకి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా సుదీప్ ఛటర్జీ సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.



## నిలకడగా రజనీకాంత్ ఆరోగ్యం

సూపర్ స్టార్ రజనీకాంత్ అస్వస్థతకు గురై ప్రస్తుతం చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా వైద్యులు తలైవాకి చిన్నపాటి సర్జరీ చేశారు. అనుభవగ్నులైన ముగ్గురు వైద్యులు రజనీకాంత్‌కు పొత్తికడుపు కింది భాగంలో స్టెంట్ వేశారు. ఈ ప్రక్రియ విజయవంతమైనట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉ ందని.. రెండు లేదా మూడు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. రజనీకాంత్ సోమవారం అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కడుపులో తీవ్రమైన నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను చెన్నైలోని అపోలో దవాఖానకు తరలించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీశ్ ఆధ్వర్యంలోని ప్రత్యేక వైద్యుల బృందం సూపర్‌స్టార్‌కు చికిత్స అందిస్తున్నారు. ఇక తలైవా దవాఖానలో చేరిన విషయం తెలుసుకున్న ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుతం రజనీకి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

## ఆ లెజండరీల గురించి
# నా పిల్లలకు చెబుతా
### నటి శోభితా ధూళిపాళ్ల



శోభిత ధూళిపాళ్ల. పేరుకి తెలిగింటి ముద్దుగుమ్మే కానీ హవా నడిపించేది మాత్రం బాలీవుడ్‌లో. అద్భుతమైన కథల ఎంపికతో పాటు తనదైన నటన శైలితో శోభిత తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. అక్కినేని నాగ చైతన్యతో ఎంగేజ్మెంట్ తర్వాత ఈ భామ తరుచుగా న్యూస్‌లో కనిపిస్తున్నారు. మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియన్ సెల్వన్' సినిమా ఫ్రాంచైజీతో ఆమె మరోసారి నేషనల్ వైడ్‌గా తన యాక్టింగ్ కెపాసిటీని నిరూపించుకున్నారు. 'పొన్నియన్ సెల్వన్-1' సినిమా రిలీజై రెండు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా చిత్ర బృందంతో కలిసి ఆమె సందడి చేశారు. ఈ క్రమంలో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఒకటి వైరల్ అవుతోంది. తమిళనాడులో అత్యంత సంచలనం సృష్టించిన 'పొన్నియిన్ సెల్వన్' నవల ఆధారంగా దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన సినిమా పొన్నియిన్ సెల్వన్. రెండు భాగాలుగా తీర్చిదిద్దిన ఈ సినిమా ఘన విజయం సొంతం చేసుకుంది. తాజాగా ప్రకటించిన ప్రతిష్టాత్మక ఐఫా అవార్డులలో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా విక్రమ్ అవార్డ్ అందుకోగా, క్రిటిక్స్ ఛాయిస్‌లో ఉత్తమ నటిగా ఐశ్వర్యారాయ్ నిలిచింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ అంతా కలిసి ఫోటో షూట్ నిర్వహించారు. ఈ ఫోటోలను శోభిత ఇన్స్టాలో పోస్ట్ చేస్తూ ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. ఈ ఫోటోలో హీరో విక్రమ్‌తో పాటు జయం రవి, కార్తి, ఐశ్వర్యారాయ్, త్రిషలతో కలిసి శోభితా ధూళిపాళ్ల ఫోటోలకి పోజ్ ఇవ్వగా 'వీరందరు ఎవెంజర్స్, నా పిల్లలకు వీళ్ల గురించి చెప్తాను' అంటూ ఆమె తన అభిమానాన్ని చాటుకున్నారు. 2016లో బాలీవుడ్ విలక్షణ దర్శకుడు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన 'రామన్ రాఘవ్ 2.0' చిత్రంతో తెరంగ్రేటం చేసిన శోభిత హిందీ ఇండస్ట్రీలో స్థిరపడిపోయారు. కాగా 2018లో అడివి శేష్ యాక్షన్ స్పై ఫిల్మ్ 'గూఢచారి'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. 2022లో వచ్చిన పొన్నియన్ సెల్వన్‌తో మరోసారి జాతీయ గుర్తింపు పొందారు. మరోవైపు మేడ్ ఇన్ హెవెన్, ది నైట్ మేనేజర్ వెబ్ సీరీస్‌లతో ఆమె ఓటీటీలోను ప్రత్యేక గుర్తింపు సాధించారు.



## నిన్నెవరూ మ్యాచ్ చేయలేరు..
# అన్‌మ్యాచ్‌బుల్
### రామ్‌చరణ్‌కు సమంత కితాబు



హీరో రామ్‌చరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ నుంచి తాజాగా 'రా మచ్చా మచ్చా..' అంటూ రెండో పాట విడుదలైంది. ఈ పాట ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఈ క్రమంలో పాటలో రామ్‌చరణ్ డ్యాన్స్‌పై ఉపాసన, సమంతలు ప్రశంసలు కురిపించారు. రామ్‌చరణ్ తన పాటను షేర్ చేస్తూ.. 'ఈ భారీ పాటను నేను ఆనందించినట్లు.. మీరూ ఆనందిస్తున్నారని ఆశిస్తున్నా' అని రాశారు. ఈ పోస్ట్‌పై ఉపాసన స్పందిస్తూ.. మిస్టర్ సీ.. మీ డ్యాన్స్‌తో హై ఓల్టేజ్ పుట్టించారని రిప్లై ఇచ్చారు. ఇక, సమంత స్పందిస్తూ.. నిన్నెవరూ మ్యాచ్ చేయలేరు అంటూ.. 'అన్‌మ్యాచ్‌బుల్' అని పేర్కొన్నారు. దానికింద ఫార్మల్ ప్యాంట్, షర్ట్ ధరించి ఎవరు ఇలా డ్యాన్స్ చేయగలరు.. అంటూ రాసుకొచ్చారు. ఇదిలాఉండగా.. రామ్‌చరణ్ కథానాయకుడిగా, శంకర్ దర్శకత్వంలో 'గేమ్‌ఛేంజర్' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని 'రా మచ్చా మచ్చా'... పాటని సోమవారం విడుదల చేశారు. ఈ పాటకి తమన్ స్వరాలు సమకూర్చగా, అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. నకాశ్ అజీజ్ ఆలపించారు. ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రంలో రామ్‌చరణ్‌తో కియారా అద్వానీ, అంజలి, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, జయరామ్, నవీన్‌చంద్ర, ప్రకాశ్‌రాజ్‌తో పాటు పలువురు కీలక ప్రాతల్లో నటిస్తున్నారు.

## బేబీజాన్ షూట్‌లో పాల్గొననున్న సల్మాన్



బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నాడని తెలిసిందే. ఓ వైపు లీడ్ యాక్టర్‌గా చేస్తూనే.. మరోవైపు కామియో రోల్‌లో కూడా కనిపించబోతున్నాడు. ఈ స్టార్ యాక్టర్ గెస్ట్ రోల్‌లో నటిస్తున్న చిత్రం బేబీ జాన్ నేషనల్ అవార్డు విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేశ్ బాలీవుడ్ డెబ్యూ ప్రాజెక్ట్ వరుణ్ ధవన్ లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. సల్మాన్ ఖాన్ ఈ మూవీ షూట్‌లో ఎప్పుడు జాయిన్ అవుతాడనే దానిపై ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. తాజా టాక్ ప్రకారం అక్టోబర్ మొదటి వారంలో బేబిజాన్ చిత్రీకరణలో జాయిన్ కాబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో వరుణ్ ధవన్, సల్మాన్ ఖాన్‌పై వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేయబోతున్నారట. ఈ సినిమాను డిసెంబర్ 25న ప్రపంచవాప్తంగా క్రిస్మస్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో వామికా గబ్బి మరో హీరోయిన్‌గా నటిస్తోంది. బేబిజాన్ నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీకి థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని సినీ1 స్టూడియోస్, జియో స్టూడియోస్‌తో కలిసి ప్రియాఅట్లీ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Akshaya Printers, H.No:7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City, Telangana. Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215